బూర్గుల రామకృష్ణారావుగారు శ్రమించకపోతే నైజాము భారత రిపబ్లిక్‌లో విలీనమయ్యేది కాదు!!

ఆయనొక సింహం! గర్జిస్తూ గుహలోకి వెళ్లే సింహం కాదు. గజబలాన్ని గడగడలాడిస్తూ, మీదకురికి, ఎముకలు లేకుండా మసిచేసే సింహం.

నైజాము ఇండియన్ (అప్పటికి ఇప్పటికీ భారత్ పేరు రాలేదు) యూనియన్‌లో కలిసిపోవడానికి నూటికినూరుపాళ్ళు తెలుగుబిడ్డ బూర్గుల రామకృష్ణారావు అవిశ్రాంత పోరాటం చేసారు. విజయం సాధించేవరకూ నిదురించలేదు.

అకళంక దేశభక్తుడు. నిజాం రాష్ట్రంలోనే పుట్టాడు. నిజాము రాష్ట్రములోనే చదివారు. బి.ఏ. ఎల్.ఎల్.బి. పట్టానందుకుని హైదరాబాదులోనే న్యాయవాద వృత్తిని ప్రారంభించారు.

1942 సంవత్సరం క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. తెల్లదొరలను మన దేశం నుంచీ తరిమికొట్టడానికీ ఉద్యమం తీవ్రరూపం దాల్చింది. ఆ ఉద్యమంలో తీవ్రంగా పాల్గొని జైలు శిక్షననుభవించారు. పిమ్మట హైదరాబాదు సంస్థానాన్ని ఇండియన్ యూనియన్‌లో విలీనం చేయాలని పోరాటం చేసారు. నిజాము ప్రభుత్వ ఆగ్రహానికి గురియై జైలు శిక్షననుభవించారు. నిజాము రాష్ట్రం ఆంధ్రోద్యమంలో అవిశ్రాంత పోరాటం చేసారు.

బూర్గుల రామకృష్ణారావుగారి అర్ధజీవితం అలుపెరుగని పోరాటములలోనే గడచిపోయింది. ఏ హైదరాబాద్ రాష్ట్రంలో అరెస్టు అయ్యారో; ఆ రాష్ట్రానికే ఆయన తొలి ముఖ్యమంత్రి అయ్యారు. ముఖ్యమంత్రి అయ్యారుగానీ, పదవి పట్టుకుని ప్రాకులాడలేదు. ఆంధ్రలో హైదరాబాదు (నిజాము) రాష్ట్రం కలిసిపోవాలని భావించారు. కలిసిపోయేట్టు చేసారు.

ఒక్క రాష్ట్రపోరాటంలోనే కాదు; వినోబాభావే ప్రారంభించిన భూదానోద్యమంలో అవిశ్రాంతంగా పాల్గొంటూ; తాను కొంతభూమిని భూదానోద్యమానికి యిచ్చారు.

హైదరాబాదు ముఖ్యమంత్రి పదవిని త్యాగం చేసి, రెండు రాష్ట్రాల కలయికకు కారణమయ్యారు. 1952 నుంచీ 1956 వరకూ ఆయన నిజాము రాష్ట్ర ముఖ్యమంత్రి పదవిలో ఉన్నారు.

బూర్గుల రామకృష్ణారావు బహుభాషాజ్ఞాని. రచయిత! తెలుగు, ఇంగ్లీషు, హిందీ, ఉర్దూ, పారశీక భాషల్లో పండితుడు. ఉమర్‌ఖయ్యాం రుబాయీలను పారశీకం నుంచీ తెలుగు భాషలోకి అనువాదం చేసారు. ఎన్నో తెలుగేతర గ్రంథాలను తెలుగులోకి అనువదించిన బహుగ్రంథకర్త.

రామకృష్ణారావుగారు హైదరాబాదు సంస్థానం మహబూబ్‌నగర జిల్లాలోని పడకళ్లు గ్రామంలో జన్మించారు. 1899 సంవత్సరం మార్చి 13వ తేదీన తెలంగాణాలోనే జన్మించారు. న్యాయపట్టానందుకున్న తరువాత, హైదరాబాదులోనే న్యాయవాద వృత్తిని కొనసాగించారు. సాహిత్యంలోని దేశభక్తి సారాన్ని ఔపోసనం పట్టారు. ఓ నాయకునికన్నా ఓ దేశభక్తుడు గొప్పవాడు! ఓ దేశభక్తుడు నాయకుడయితే; దేశ పౌరసత్వ ధర్మాలను, విలువలను గ్రహించి శ్రమిస్తాడు. ఈ గొప్పతనాన్ని వ్యక్తి గుణశీతలనూ కేంద్రం గ్రహించింది. దేశం ప్రగతి పథంలో పయనింపచేసే – చిత్తశుద్ధి కలవాడని గ్రహించిన కేంద్ర ప్రభుత్వం కేరళ, ఉత్తరప్రదేశ్, గవర్నరుగా నియమించింది. తెలంగాణా తెలుగువారి అభ్యున్నతికి తోడ్పడ్డారు. **రాష్ట్ర ముఖ్యమంత్రి పదవి నిర్వహిస్తూనే– రాష్ట్ర విలీన కారకులయ్యారు.**

చిత్రవిచిత్రమైన నా చిత్తక్షోభ ఏమంటే– ఇలాటి ప్రాతఃస్మరణీయులను ఇప్పటివారికి విదితం కావడం లేదేన్న బాధ కలుగుతుంది. ●



శిరమున ఉన్న ఆ గాంధీ టోపీ, ఆ తీక్షణ వీక్షణమూ, ఆ విశాల పాలమూ, భృగిటీగల సమరయోధుడు బూర్గుల రామకృష్ణారావు 1967 సంవత్సరం సెప్టెంబర్ 14వ తేదీన, తనకిక ప్రపంచంతో నిమిత్తం లేదని నిష్క్రమించాడు.

We Provide your comfortable Stay and Tasty Food Hospitality

bd

Bhimas Deluxe Hotel

(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)

34-38, G.Car Street (Near Railway Station),
TIRUPATI - 517 501 (A.P.)
Phone : 0877-2225521, 6669199, Fax : 2225471
Website : www.bhimasdeluxehotels.com
E-mail : bhimasdeluxe@rediffmail.com

భగవంతునికి భక్తునికి
అనుసంధానమైనది
అంబికా దర్బార్‌బత్తి

ఆరాధించవలసిన అయిదుగురు తల్లులు!

భూమాత

నదీమాత

గీతా మాత

తులసీ మాత



గోమాత

జాతి యొక్క సంస్కృతి జీవనధర్మంపై ఆధారపడియున్నది. భారత సంస్కృతి వేదములను ఆధారము చేసుకున్నది. ప్రకృతీకృతమైన సమస్త ప్రాణుల పట్ల భారత సంస్కృతి పూజ్యభావం కలిగి ఉన్నది! పూజిస్తున్నది. ఇవన్నీ జీవనధర్మంగా ఒక దారానికి బంధీకృతమైనట్లు ఉన్నవి. భారతీయ సంస్కృతిలో ముఖ్యంగా ఐదు మాతలను పంచమాతలుగా ఆరాధించే పరమధర్మం ఉన్నది. ఈ ఐదింటినీ భరతజాతి స్ఫూర్తి చిహ్నములుగా, సంస్కృతిని గుర్తు చేసే పూజనీయ పవిత్రకములుగా, పంచమాతలుగా అభివర్ణించి చెప్పారు. మాతృభావనా ప్రేరణాంశ ధర్మమైతేనే మనసుల్లో పూజ్యభావం కలుగుతుంది. భక్తిభావాన్ని అంకురింపచేస్తుంది.

మాతృమూర్తులుగా ఆరాధించే మనఃప్రేరకులయ్యారు మన పూర్వులు; 1. భూమాత, 2 గోమాత, 3 నదీమాత 4 గీతామాత 5 తులసీ మాతలను పంచమాతలుగా ఆరాధించడం జాతిధర్మం అన్నారు. జాతి సుఖ, సౌఖ్య, సౌభాగ్యదాయకంగా వర్ధిల్లాలని పంచమాతృకారాధనకు ప్రాధాన్యమొసగారు.

'సముద్రవసనే దేవీ, పర్వత స్తన మండలే
విష్ణుపతీ నమస్తుభ్యం పాదస్పర్శం క్షమస్వమే'

ఉదయమునే మంచం మీద నుంచి లేస్తూ, భూమిమీద అడుగుపెడుతూ, అమ్మా! తల్లీ! భారతమాతా! లక్ష్మీ! విష్ణుపత్నీ! నేను జీవించడానికి తప్పనిసరై నా పాదములతో నిన్ను తాకవలసి వస్తున్నది; నన్ను క్షమించు... అంటూ ఆమెకు నమస్కరించడం ఈ జాతి శ్రేష్ఠభావనకు చిహ్నం. ●

ఎక్సరే "శ్రీశ్రీ నానీలు" గ్రంథావిష్కరణం

ప్రముఖ కవి S.R.పృథి రచించిన 'శ్రీశ్రీ నానీలు' గ్రంథాన్ని ఎక్స్‌రే కొల్లూరి ఆవిష్కరించారు. వేదికపై చలపాక, శ్రీశ్రీ అశోక్, రచయిత పృథ్వి, సోమేపల్లి డా॥ఘంటా, శ్రీమతి కోపూరి, ఆంజనేయరాజు ప్రభృతులు నిలుచుని, ఆవిష్కరింపబడిన గ్రంథ ప్రతులను బట్టి తమ ఆనందాన్ని ఆవిష్కృతం చేసారు.

వరంగల్లులో వేయి స్తంభాల దర్శనం

ఓరుగల్లు. ఆ పేరు వినగానే ప్రతి తెలుగువాడి హృదయంలో ఒక చిత్తరవు మెదులుతుంది. ఆ చిత్తరవు పౌరుషానికి ప్రతిరూపం. పౌరుషం రూపంలోనే కాదు, చేసిన ప్రతి పనిలోను చూపింది. ఆ రూపం ఇంకెవరిది వీరనారి 'రుద్రమదేవి'ది! శత్రువులను చెండాడడం, కళలను పెంచి పోషించటంలోనూ రుద్రమదేవి వంశానిది అందెవేసిన చేయే! వారి పాలనా సమయంలో నిర్మించిన కట్టడాలను చూస్తే ఈ విషయం మనకు అర్థం అవుతుంది. వీరు మన మధ్యన లేకపోయినా సరే, వీరు సృష్టించిన సంపద మాత్రం ఉంది. ముఖ్యమైనది వేయి స్తంభాల గుడి. ఈ వేయిస్తంభాల గుడి ఓరుగల్లుకి రెండు మైళ్ల దూరంలో నిర్మించబడి ఉంది. ఈ నిర్మాణాన్ని పదకొండవ శతాబ్దంలో (1163) 'మొదటి రుద్రమదేవ' మహారాజు నిర్మించాడని ఇక్కడ ఉన్న శిలాశాసనం ద్వారా తెలుస్తోంది. ఈ దేవాలయానికి రెండు ముఖద్వారాలు ఉన్నాయి. మొదటిది దక్షిణపు ద్వారం, రెండవది తూర్పు ముఖద్వారం. ప్రస్తుతం మాత్రం దక్షిణపు ద్వారం మాత్రమే అందుబాటులో ఉన్నది. ఈ ద్వారము ద్వారానే దేవాలయ ప్రాంగణంలోకి ప్రవేశించవలసి ఉన్నది. ఈ ఆలయంలో శివుడు, విష్ణువు, సూర్యభగవానులు కొలువై ఉన్నారు. శైవము, వైష్ణవము అని హిందువులు తగవులాడుతున్న తరుణంలో ఈ శివవైష్ణవాలయం నిర్మించటం సాహసం అని చెప్పాలి. ఆంధ్రదేశంలో ఎక్కడా శివుడు మరియు విష్ణువు ఒకే చోట కొలువైవున్న దాఖలాలు లేవు. అందునా సూర్యభగవానుడితో కలిసి ఉండటం అరుదు. కొన్ని ఆలయాలలో నవగ్రహాలు ఒకే చోట ప్రతిష్టించి ఉండడం మనము ఇప్పటి వరకు చూశాము. కానీ ఈ వేయిస్తంభాల ఆలయంలో 'భానుడి'కిప్రత్యేక గర్భగుడి ఉండటం విశేషం. ఇది ఈ వేయిస్తంభాల గుడియొక్క మొదటి ప్రత్యేకత.

ఆలయమందు ఏ భాగము చూసినా మనకు ఆ కాలమందలి శిల్పుల పనితీరు కనిపిస్తుంది. దక్షిణ ద్వారము నుంచి లోనికి ప్రవేశించగానే ఆలయ వెనుక భాగం మనకు దర్శనమిస్తుంది. ప్రవేశం తర్వాత ఎడమవైపు రెండు లింగాలు కనిపిస్తాయి. వీటి ఎత్తు నాల్గు అడుగుల వరకు ఉంటుంది. పక్కనే కోనేరుని మనం చూడవచ్చు. ఈ కోనేరు లింగాకారంలో ఉంటుంది. శివున్ని అభిషేకించిన ద్రవాలు మొత్తం ఈ కోనేరుకి చేరుతాయి. ఈ విధంగా చేరటానికి కాకతీయులు భూగర్భ మార్గాన్ని నిర్మించారు. ఈ విధంగా అభిషేకించిన నీరు కోనేరుకి వచ్చి చేరటం మనల్ని ఆశ్చర్యచకితుల్ని చేస్తుంది. ఇది ఈ కోనేటి యొక్క విశిష్టత. ఈ కోనేటి ప్రక్కనే తూర్పు ద్వారము దగ్గర మనకు శిలాశాసనం కనిపిస్తుంది. ఈ శిలాశాసనము ఎత్తు ఐదు నుంచి ఆరు అడుగుల మధ్యలో ఉంటుంది. శిలాశాసనం ముందువైపు పైభాగమునందు శివలింగము, దాని ఇరువైపుల సూర్యచంద్రులు ఉంటారు. లింగము క్రింది భాగమున నంది మరియు గోవు ఉంటాయి. అదే విధంగా శాసనం వెనుక భాగమునందు లింగాకారం చెక్కబడి ఉంటుంది. ఈ శిలాశాసనం ఎడమవైపు వినాయకుడు మరియు కుడివైపునందు మహావిష్ణువు ప్రతిమలు చెక్కబడి ఉన్నది. శిలాశాసనము నందుగల భాష తెలుగు, ద్రవిడములు సమూహారముగా వున్నది. ఇక ఆలయ భాగానికి వస్తే, ఆలయ ముఖము ఉత్తరం వైపు ఉన్నది. ఆలయము ముందు భాగము నందు నందీశ్వరుని విగ్రహం కొలువై ఉన్నది. ఈ నందీశ్వరుడు ఆరు అడుగుల పొడవు, ఐదు అడుగుల ఎత్తు మరియు రెండు అడుగుల వెడల్పుతో చెక్కబడి ఉండి. కానీ ఇప్పుడా నందీశ్వరుడు శిథిలావస్థలో ఉన్నాడు. నందీశ్వరుని వెనుక భాగంలోనే వేయి స్తంభాలతో నిర్మితమైన మండపము ఉన్నది. ఆలయములోకి ప్రవేశించగానే సిద్ధి వినాయకుడు దర్శనమిస్తాడు. ముందుకు కదలగానే మనకు శివుడు లింగాకారంలో కనిపిస్తాడు. ఇక్కడ సాధారణ భక్తులను సైతం గర్భగుడిలోకి అనుమతిస్తారు. శివుని గర్భగుడికి ఎదురుగా భానుడు కొలువైవున్నాడు. శివుడు, భానుడు ఆలయాల మధ్యలో విష్ణువు ఉన్నాడు. కానీ ఇపుడు శివుని విగ్రహము మాత్రమే మనకు దర్శనమిస్తుంది. భానుడు మరియు పద్మావతి నిలయుడైన విష్ణువు యొక్క విగ్రహాలు ఉండవు. కేవలం ఆలయాలు మాత్రమే దర్శనమిస్తాయి. ఈ మూడు గర్భగుడుల మధ్యలో, అనగా ఆలయ మధ్యభాగమందు నాట్య మండపం గుండ్రంగా వృత్తాకారంలో నిర్మించబడి ఉన్నది. ఆలయం చుట్టూ విశాలమైన అరుగులను అనుసంధించారు. అదేవిధంగా ఆలయం చుట్టూ విశాలమైన స్థలం ఉండునట్లు, ప్రహరీని నిర్మించారు. ఆలయం పడమర భాగము వైపున ఒక సొరంగ మార్గ ప్రవేశం ఉన్నది. కాకతీయుల కాలము నందు ఆలయం నుంచి వారి కోటకు రహస్య సొరంగ మార్గాన్ని నిర్మించారనే విషయం ప్రచారంలో ఉంది. ఇప్పుడా ప్రవేశము పాడుబడి, శిథిలావస్థలో ఉన్నది. ఆలయం యొక్క విశేషాలు. ఆలయం భాగానేయున్నది, కానీ ఆ వేయి స్తంభాల మండపమును ఇపుడు తొలగించారు. ఆ విషయమే నా మనసును కలిచివేస్తుంది. ఎంతగా పునఃనిర్మించినా ఆ శిల్పచాతుర్యం ఎలా వస్తుంది? ఆలయం మొత్తంలో నిర్వాహక లోపం మనకి కనిపిస్తుంది. మన చారిత్రక సంపదని మనమే మట్టిపాలు చేయడం సిగ్గుపడాల్సిన విషయం. ఎటుచూసినా అపరిశుభ్రం తాండవిస్తుంది. కాకతీయులు మనకందించిన వారసత్వ సంపదని మనం కాపాడుకోలేక పోతున్నామనే బాధ ఉన్నది. ప్రభుత్వం కూడా ఈ విషయంలో అంటీఅంటనట్లు వ్యవహరించటం శోచనీయం. చారిత్రక సంపదని జాగ్రత్త చేసుకోవటం, దానిని ముందు తరాల వారికి అందించటం మన బాధ్యత. ఇప్పటికయినా ఇలాంటి కట్టడాల విషయంలో శ్రద్ధ వహించకపోతే మన చరిత్ర వైభవం మరుగున పడే ప్రమాదం ఉన్నది. **(దుర్గా. కాసరెల్లి సౌజన్యంతో)**

త్రినేత్రుడు తలకిందులుగా...

చుట్టూపరచుకున్న పచ్చదనం... ఏపుగా పెరిగిన కొబ్బరి చెట్లు... రారమ్మని ఆహ్వానించే ఆహ్లాదకర వాతావరణం.. ఇదీ పశ్చిమగోదావరీ జిల్లా భీమవరం పట్టణానికి సమీపంలోని యనమదుర్రు గ్రామ వైశిష్ట్యం. ప్రశాంతమైన ఈ వాతావరణమే కాదు, ఆ ఊళ్ళోని శివాలయం కూడా పర్యాటకులను విశిష్టంగా ఆకర్షిస్తోంటుంది. అదే శక్తీశ్వరాలయం.

పురాణకథనం ప్రకారం యనమదుర్రు గ్రామం ఒకప్పటి పేరు యమునాపురం. మహిషాసురుడి అనుచరుడైన శంభాసురుడు పూర్వం ఈ ప్రాంతంలో మునుల తపోదీక్షలకు భంగం కలిగిస్తూ, ప్రజలను బాధించేవాడు. ఆ రాక్షసుడికి యముడి చేతిలోనే మరణం ఉందని తెలుసుకున్న మునులు యమధర్మరాజును శంభరుణ్ణి సంహరించాల్సిందిగా కోరారు. వారి కోరికమేరకు సమవర్తి ఆ రాక్షసుడితో యుద్ధానికి దిగాడు. కానీ గొప్ప శివభక్తుడైన శంభరుడి చేతిలో ఓడిపోయాడు. అప్పుడు యముడు పరమశివుడి కోసం ఘోరతపస్సు చేశాడు. కైలాసంలో తలక్రిందులుగా యోగనిష్టలో ఉన్న శివుడు.. యమధర్మరాజు తపస్సును గుర్తించ నట్లు నటించాడు. అయితే పార్వతీదేవి ప్రత్యక్షమై, తనశక్తిని యముడికి ప్రసాదించి, శంభరుణ్ణి వధించేలా చేసింది. అప్పుడే అమ్మవారు నీ పేరుమీద ఈ ప్రాంతాన్ని యమపురి అని పిలుస్తారు అని వరమిచ్చింది. మరో వరం కోరుకోమని పార్వతీదేవి అడగ్గా, భవిష్యత్తులో, ఈ ప్రాంతంలో రాక్షసులు సంచరించడానికి వీల్లేకుండా మీ ఆదిదంపతులు ఇప్పటికిప్పుడే ఎలా ఉన్నారో అలాగే ఇక్కడ కొలువుదీరండి అని యముడు ప్రార్థించాడు. అప్పటికి తలక్రిందులుగా తపస్సు చేస్తున్న శివుడూ, మూడు నెలల బాలింతగా కుమారస్వామిని ఒడిలో పెట్టుకున్న పార్వతీదేవి అలాగే రూపాలు ధరించి ఇక్కడ వెలిశారు. తలకిందులుగా ఉండే మహాదేవుడు శివపార్వతులతో కలిసి ఉండే కార్తికేయుడు ఉన్న ఏకైక దేవాలయం దేశంలో ఇదొక్కటే. శక్తి, ఈశ్వరుడు కలిసి ఉన్న పీఠం కాబట్టి దీనికి శక్తీశ్వరాలయం పేరు వచ్చింది.

ఆ నీటితోనే నైవేద్యం

ఈ ఆలయానికి తూర్పువైపున శక్తిగుండమనే మంచినీటి చెరువు ఉంది. ఇందులోని నీటితోనే స్వామికి పూజలూ అభిషేకాలూ చేస్తారు. అంతేకాదు, నైవేద్యం కూడా ఈ నీటితోనే తయారు చేస్తారు. గతంలో ఓసారి ఈ చెరువు పూడిక తీయాలని నీటిని పూర్తిగా తొలగించారు. వేరొక చెరువు నుంచి నీటిని తెచ్చి నైవేద్యం తయారుచేయాలనుకున్నారు కానీ ఎంతసేపటికీ పదార్థాలు ఉడకలేదు. అప్పుడు శక్తిగుండంలో చిన్న గొయ్యితవ్వి అక్కడ ఊరిన నీటితో వండితే నైవేద్యం ఉడికిందట. కాశీలోని గంగానది అంతర్వాహినిగా వచ్చి ఈ శక్తిగుండంలో కలుస్తుందని పెద్దలు చెబుతారు.

ఈ ఆలయంలో శివరాత్రి పర్వదినాన్ని ఘనంగా నిర్వహిస్తారు. మూడురోజులు పాటు స్వామివారి కల్యాణం, తెప్పోత్సవం వైభవంగా జరుగుతాయి. కార్తీకమాసంలో అభిషేకాలతోపాటు, సుబ్రహ్మణ్యషష్ఠి సందర్భంగా అయిదురోజులు ప్రత్యేక పూజలు జరుగుతాయి. ఆలయ ప్రాంగణంలో నవగ్రహ మండపం, నాగదోష నివారణకు రాహుకేతు ఆలయం, ఆంజనేయ స్వామి, అయ్యప్పస్వామి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలు కూడా ఉన్నాయి. ●

ద్వారబంధము తగిలి తలకు బొప్పి కట్టినా గొప్పలకి నవ్వే కొత్తకోడలులా వస్తున్నావే దుర్ముఖీ దుర్ముహూర్త వేళ గడపదాటి రాకమ్మా!

కొత్త సంవత్సరంగా వస్తూన్న దుర్ముఖీ! గడపదాడి వస్తున్నప్పుడు కొంచెము తలవొంచుకుని రావాలమ్మా! కానిచో, తలకు ద్వారబంధము తగిలి బొప్పికట్టవచ్చు.

గడపదాటి వచ్చే కొత్తకోడలిలా చూసుకోకుండా వస్తే క్రింద గడపతగిలి కాలికి దెబ్బ తగలవచ్చు. జాగరూకత వహించు. దుర్ముఖివై అడుగిడకు. ఆస్తికతను అటకెక్కించి నాస్తిక భావకులు పెరుగుతున్నారు. జాగ్రత్తగా నీవు అడుగువేయాలి. సుముఖంగా నీవు వస్తే నీ పరంగా శుభములు జరుగుతాయనే ఆశ చిగురిస్తుంది.

వేపాకు చేదును హరించి బెల్లం, చెరకుముక్కలు తీపి కబుర్లు తేవాలమ్మా దుర్ముఖీ!

రెండు తెలుగు రాష్ట్రాలలోనూ సుఖశాస్తులు మల్లెలులా సౌరభించాలి. రాష్ట్రాలు రెండుగా విడివడినా, మా తెలుగు తల్లికి మల్లెపూదండ యని ముక్తకంఠంతో పాడాలి. ఇరు రాష్ట్రాలవారూ భారతికి జేజేలు పలకాలి.

గలగలా గోదారి, బిరబిరా కృష్ణమ్మ జలసమృద్ధిని కలిగి ఉండాలి. సుజలాం సుఫలాం మలయజ శీతలాం, సస్యశ్యామలాం వందేమాతరం అంటూ నేల నలుచెరగులా చిందులేయాలి. సాగరంలోకి పారే నదీజలాలను అదుపు చేయాలి.

దుర్ముఖీ రావమ్మా సుగుణభూషితవై వర్ధిల్లుతూ రావమ్మా! ప్రకృతి సౌందర్య పచ్చగా పరిఢవించే వేళ, సర్వాభరణ సుగుణ భూషితవై ఘల్లుఘల్లున రావాలి.

మా గుండెలలో ఆనందము అరిసి విరిసేట్టుండాలి. ఇరుగుపొరుగు లందరూ స్నేహభావంతో మెలగాలి. సర్వేజనా స్సుఖినోభవన్తు. యంటూ దుర్ముఖివత్సరం సర్వశుభములొసగాలి. జనులందరూ ఆయురారోగ్య ఐశ్వర్యములతో వర్ధిల్లాలని ఆశీర్వదించాలి.

సంక్రాంతి కూర్చని సౌభాగ్యమును కొత్త సంవత్సరం కూర్చకుండిన– జనులెలా కూర్మితో నుండగలరు దుర్ముఖీ! సుఖముగా నీవు అడుగుపెట్టు. తలకు ద్వారబంధము తగిలి బొప్పి కట్టకుండా చూచుకుంటూ కొత్త కోడలిలా కులుకుతూ గడపలోకి అడుగుపెట్టు. ●



అనంతపద్మనాభన్ జి. రాజేంద్రన్ రాధాకృష్ణమూర్తి

జి.ఆర్.టి- గ్రేట్ గోల్డు డైమండ్ జ్యువెలర్స్!

1964 సం॥ములోని త్యాగరాజ నగరంలోని ఉస్మాన్‌రోడ్‌లో చిన్నగా ప్రారంభమైన జి.ఆర్.టి. బంగారు నగల దుకాణం దేశం గర్వించదగ్గ మెగా నగల దుకాణమయింది.

వ్యవస్థాపక – అధ్యక్షుడు జి. రాజేంద్రన్ అతి సౌమ్యుడు, సౌజన్య హృదయుడు. చిరునవ్వే ఆయన పెట్టుబడి. విభూతి రేకల మధ్యనున్న కుంకుమబొట్టే ఆయన ఐశ్వర్యం.మాతృభక్తి ప్రసాదితమే– ఆయన సౌభాగ్యం.

ఆయన పుత్రిక జయశ్రీ, పుత్రులు అనంతపద్మనాభన్ (ఆనంద్), రాధాకృష్ణ పెరిగి పెద్దవాళ్లు కావడంతో ఆయన ఐశ్వర్యమూ పెరిగింది.

స్టార్ హోటల్స్ ప్రారంభించారు. విద్యాలయాలు ప్రారంభించారు. ఇంజనీరింగు కాలేజీలను ప్రాధమికోన్నత విద్యాలయాలను నెలకొల్పారు. జి.ఆర్.టి నగల బృహత్ దుకాణాలు– భారీ మెగా షోరూములుగా, ఒక్క చెన్నయ్‌లోనే గాకుండా, బెంగుళూరు హైదరాబాదు– వంటి ముఖ్య నగరాల్లో ప్రారంభించబడ్డాయ్. వారి కుమార్తె జయశ్రీను వుమ్మిడి బంగారు చెట్టి వంశజులు వుమ్మిడి సుధాకర్ కుమారుడు రాజేష్‌కిచ్చి వివాహం చేయడంతో బంగారం బంగారంతో కలిసిపోయింది. పెద్ద కుమార్డు అనంత పద్మనాభన్‌కు విజయా కెమికల్స్ అండు టాయిలెట్స్ (తెలంగాణా) కంపెనీ అధినేత సాయినాథ్‌గుప్త జ్యేష్ట కుమార్తెను చేసుకోవడంతోనూ, రాధాకృష్ణునికి నెల్లూరు బంగారు వ్యాపారుల కుమార్తెతో వివాహం జరిపించడంతోనూ రాజేంద్రన్ ఆర్యవైశ్య కుల సాంప్రదాయ వైశిష్ట్యాన్ని పాటించారు. రాజేంద్రన్ కుమారులిరువురికీ బాధ్యతల్లోనే భాగం కల్పించడంతో అలనాటి ఉమ్మడి వైశ్య కుటుంబ ధర్మాన్ని ప్రత్యక్షంగా చూచే అవకాశం కలుగుతుంది. కానీ అర్ధశతాబ్దికి పైగా– వారి వాత్సల్యాన్ని రుచి చూచినవారికి రాజేంద్రన్‌గానీ, వారి కుమారులు అనంత పద్మనాభన్, రాధాకృష్ణలను బంగారు నగరల షోరూమ్‌ల్లోదర్శించే అవకాశం లేకపోవడం లోటుగా ఉండినప్పటికినీ, వారి ఉద్యోగులు ఆప్యాయతతో ఆ లోటు కనపడనీయడం లేదు.

జి.ఆర్.టి. కోట్లు సంపాదించిన విధంగానే కోటి కొలదీ రూపాయలను సేవా సంస్థలకు విరాళంగా యిస్తూ ఆదుకుంటున్నది. శంకర్‌నేత్రాలయకు కోటి రూపాయలివ్వడం, అడయార్ కాన్సర్ ఇనిస్టిట్యూటుకు కోటి రూపాయలు విరాళములివ్వడంలో వారి విజ్ఞత ప్రధానంగా కనిపిస్తూన్నది. ఇది బహుదా ప్రశంసింపదగిన విషయం. వారిని దీర్ఘాయురారోగ్య ఐశ్వర్య సంపన్నులుగా దీప్తినొందుతూ ఇంతకు పదింతలు సంపాదించి, చేసే దానధర్మాలను పదింతలుగా చేయాలంటూ ఏడుకొండలవాణ్ణి ప్రార్థిస్తున్నాం. ●

తిరుమలక్షేత్రంలో నిరతాన్న భోజనం - ఇంటూరి ప్రతిపాదన

తిరుమలకు వచ్చే యాత్రీకులకు ఉచితంగా భోజనం పెట్టాలని ప్రతిపాదించినవారు ప్రఖ్యాత పత్రికా రచయిత కీ॥శే॥ ఇంటూరి వేంకటేశ్వరరావు అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డా॥ ఎన్.టి. రామారావు అనుమతి పొంది– అమలు జరిపిన అన్నదాత ఎల్వీ రామయ్యగారు. ఈ పథక పోషకుల్లో డా॥ నల్లి కుప్పుస్వామి చెట్టి కూడా ఉన్నారు. వీరెవ్వరి పేరులు ప్రకటితం కాకుండా ఒక్క దేవస్థానం వారినే పేర్కొంటున్నారు.

ఎల్వీరామయ్యగారు, తాను తన మిత్రుల ద్వారా కొన్ని లక్షల రూప్యములివ్వడంతో ఈ పథకం ఈనాటి ఎన్నో కోట్ల మూలధనమునకు మూలకమైంది. కలియుగదైవం ఆ కోనేటిరాయనికి ఏటా భక్తులు సమర్పించుకునే కానుకల విలువ వందలకోట్లలోనే ఉంటుంది. ఆ సొమ్ము స్వామి బొక్కసానికి పరిమితం కాదు.

ఆపద్బాంధవుడయిన శ్రీవారి సాక్షిగా వికలాంగులు, అనాథలు, అభాగ్యుల కోసం తితిదే అనేక సేవా కార్యక్రమాలు చేపట్టింది.

శ్రీవారి భక్తుల కోసం తితిదే చేపట్టిన గొప్పసేవ నిరతాన్నదానం. నిత్యం ముప్పయివేలమందికి పైగా భక్తులు అన్నదానం కాంప్లెక్స్‌లో భోజనం చేసి స్వామివారి మహాప్రసాదం తిన్నంతగా ఆనందపడిపోతుంటారు.

రోజూ ఉదయం తొమ్మిదిగంటల నుంచి రాత్రి పదకొండు గంటలదాకా 'లేదు, కాదు' అన కుండా ఉచిత భోజనాలు పెడుతూనే ఉంటారు. ఎవరైనా సరే ఈ నిరతాన్నదానం యజ్ఞానికి ఉడతాభక్తిగా తమవంతు సాయం చేయవచ్చు.

యూరోపు దేశాల్లో తెలుగువారి పర్యటనా విశేషాలు

ఇరవయ్యో శతాబ్దం తొలిదశకాల్లోనే ఐరోపా ఖండంలో తెలుగువారు పాగావేశారు! వారి యాత్రల విశేషాలు కురమెళ్ల వెంకటరావు 'మా మహారాజుతో దూరతీరాలు' అన్న గ్రంథంలో అమెరికా, ఇంగ్లాండు దేశాల విశేషాలను విడిగా రాసి, జర్మన్, స్వీడన్, ఆస్ట్రియా, స్విట్జర్లాండు, ఇటలీ, ఫ్రాన్సు దేశాల యాత్రానుభవాల్ని ఒక అధ్యాయంలో వివరించారు. ఆయన 1930 సెప్టెంబరు 12 జర్మనీలోని బ్రిమెన్‌రేవులో ప్రవేశించారు. అప్పట్లో అక్కడ గొడౌన్లలాంటి ఇళ్ళున్నాయట. బీరు పరదలై పారేదట. మనం మంచి నీళ్లు తాగినట్లు అక్కడ బీరు తాగుతారట. బెర్లిన్‌లో స్త్రీలు కూడా బీరు తాగుతారని ఆయన రాశారు. అక్కడ హిందూస్థాన్ రెస్టారెంటులో భారతీయ విద్యార్థులు ఆయన పట్ల అసభ్యంగా ప్రవర్తించారని రాశారు. అమెరికాలో భవనాలు ఎంత ఎత్తో స్వీడన్ చెట్లు అంతకన్నా ఎత్తని రాశారు. స్వీడన్‌లో అమ్మాయిలు చాలా అందంగా ఉంటారని, పనికత్తెలు కూడా పాలరాతి బొమ్మల్లా ఉంటారన్నారు. తర్వాత ఆయన జెకొస్లావేకియా మీదుగా ప్రయాణించి ఆస్ట్రియా చేరుకొన్నారు. తొలిసారిగా అక్కడాయన జెయింట్ వీల్ చూసి ఆశ్చర్యపోయారు. ఒక పెగ్గు విస్కీ ఇప్పించమని వెంటాడే యువతుల గురించి బలవంతపెట్టేవారి గురించి చాలా రాశారు. ఇక వియన్నా నుండి స్విట్జర్లాండు వెళ్లాక అది ఆయనకి భూతల స్వర్గంలా కనిపించింది. పూలు వాడవు. ఆహ్లాదకరమైన ప్రకృతి, ప్రకృతి రామనీయకత ఎలా ఉంటుందో తెలుసుకొన్నారు. తర్వాత ఆయన ఇటలీ వెళ్లారు. వెనిస్ నగరంలో రోడ్లన్నీ కాలువల మయమట. ఎదురుగా ఉన్న ఇంట్లోకైనా గండోలా అనే తెప్ప మీద వెళ్లాల్సిందే. సముద్రంలో మేడలు, నీటిమీద నడకలు అక్కడి ప్రత్యేకం. ఇటలీలో 'మేకరోని' అనే సేమ్యాలాంటి పదార్థాన్ని అందరూ తింటారు. కొత్తవాళ్లు తినడం కష్టం. ఫ్లారెన్స్ నగరంలో ఎక్కడ చూసినా పూలే! ఆంధ్రుల మనస్తత్వానికి ఇటలీవారి మనస్తత్వంలో, మాటతీరులో, మానసికోద్రేకంలో పోలికలున్నాయన్నారు. వారు తలవెంట్రుకలు కత్తిరించుకోరట. ప్యారిస్‌లో అన్నీ వింతలే. ఫ్యాషన్లకు నిలయం. అందాలభరిణి. ఫ్రాన్సుదేశాన్ని సంగీత సాహిత్య శృంగార కూడలి' అన్నారు.

పుప్పల లక్ష్మణరావు 'బతుకుపుస్తకం'లో తాను 1922 ప్రాంతాల్లో జర్మనీలో విద్యార్థిగా ఉన్నప్పుడు ఎదురైన అనుభవాలు రాశారు. అయితే అపుడు ద్రవ్యోల్బణం కారణంగా ఆర్థిక సమస్యలు బోలెడుండేవి. యూనివర్శిటీ ప్రొఫెసర్లు కూడా పస్తులతోనే పడుకునే దుస్థితి ఉండేది. జర్మనీ స్త్రీ ఒక సిగరెట్టు కోసం అమెరికన్ సోల్జర్‌తో ఓ రాత్రంతా గడపడానికి సిద్ధమైన గడ్డురోజులవి. ప్రకాశం పంతులు 1906లో తొట్టివైద్యంలో ప్రసిద్ధుడైన లూయిఖాన్‌ని చూడడానికి జర్మనీ వెళ్ళారు. అప్పట్లో అక్కడ మిలటరీ అధికారులదే వైభోగమని ఆయన రాశారు. వి.యన్. శర్మ. 1953లో జర్మనీ సందర్శించారు. అప్పుడు కూడా జర్మనీ స్థితి భయంకరం! ఎక్కడ చూసినా రాళ్లకుప్పలు, బూడిద పోగులూ కనిపించాయంటారు.

గండికోట లక్ష్మీనరసింగరావు 1985లో తన జర్మనీ అనుభవాలు రాశారు. ప్రతివ్యక్తీ కొన్ని సంవత్సరాలు మిలటరీలో పనిచేసిన తర్వాతే మిగిలిన వృత్తులు చేపట్టాలన్నది అక్కడ నియమమట. ఎ.బి.కె. ప్రసాద్ 1988లో జర్మనీ సందర్శించారు. మ్యూనిక్, బాన్, కొలోన్, బెర్లిన్, హేంబర్గ్, ఫ్రాంక్‌ఫుట్ వంటి ప్రాంతాలు సందర్శించారు. నలభైమూడు సంవత్సరాల్లో జర్మనీ కళ్లు మిరుమిట్లు గొలిపే ప్రగతి సాధించిందన్నారు. వారంతా హిట్లర్‌ని అసహ్యించుకొంటారనీ, మళ్లీ యుద్ధం రాకూడదని వారు కోరుకుంటారని రాశారు.

మాస్టర్ కృష్ణమాచార్య 1972లో రెండు నెలలపాటు శిష్యుల ఆహ్వానం మీద ఐరోపా ఖండం సందర్శించారు. 'ఫ్రాక్–పశ్చిమములు' పేరుతో తన యాత్రానుభవాలు ఆయన గ్రంథస్థం చేశారు. 341 పుటలున్న ఈ గ్రంథంలో ఎక్కువగా ఆయన ఆధ్యాత్మిక విశేషాలు, సభలు, సందేశాలు మొదలైనవి రాశారు. పాశ్చాత్యుల్లో దినచర్య అంతా ఉరుకులు పరుగులతో జరిగినా భోజనం మాత్రం కనీసం మూడు గంటలపాటు చేస్తారని రాశారు. మంచినీటికి బదులు పండ్ల రసాలు, లేదా మద్యం సేవిస్తారు. తెల్లవారిలో ఎక్కువ మంది నిత్యస్నానాలు గానీ, దంతావధానం కానీ చేయరట. గాంధీ మహాత్ముడికి, అరవిందయోగికి ఫ్రాన్సులో మందిరాలు నిర్మించారని, తాను సందర్శించినట్లు రాశారు. లియాన్ నగరంలో పార్కిన్‌సన్ వైద్యశాలలో గాంధీమహాత్ముడి పవిత్ర దేవాలయం ఉందని రాశారు. గాంధీమహాత్ముడిని అక్కడివారు నారాయణుని దశావతారంగా కొలుస్తారట. ఐరోపాలో బాహాటంగానే ముద్దులు పెట్టుకోవడం, ఇద్దరు వ్యక్తుల దార్లు వేరయినప్పుడు షేక్‌హ్యాండ్లతోపాటు చుంబన తప్పనిసరియని బెల్జియం, ఫ్రాన్స్, స్విట్జర్లాండ్, హాలెండ్ దేశాల్లో చాలామందికి ఇంగ్లీషురాదనీ, ఫ్రెంచి భాషనే మాట్లాడుతారుట. మాస్టరు కృష్ణమాచార్య హాలెండు నుంచి ఫ్రాన్స్‌కు వెళ్లేదారిలో కనిపించిన పర్వతశ్రేణులకు 'ఆ పర్వత శిఖరములు గొంగళ్లు కప్పుకొని కూర్చున్న వృద్ధులవలె" ఉన్నాయంటారు. బెల్జియంలో మోసాలు తక్కువ. ఏదైనా మోసం జరిగితే వెంటనే పోలీసులు రంగప్రవేశం చేస్తారు. ఎందరో రచయితలు తమ ఐరోపా అనుభవాలు నిక్షిప్తం చేశారు.

(**చీకోలు సుందరయ్య** సౌజన్యంతో)